

80 అడుగుల రహదారికి ఇరువైపులా పార్క్‌చేసిన ట్రావెల్స్, కమర్షియల్ వాహనాలు

నడిరోడ్డుపై వాహనాల తిష్ట

- రహదారులపై రాంగ్ పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు
- 80 అడుగుల రోడ్డులో నిలిపి వదిలేసిన కార్లు
- రాకపోకలకు ఇబ్బందులు.. దృష్టి సారించని అధికారులు


నరసింహనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్ ముందు కార్ల పార్కింగ్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 45 వార్డుల్లో చాలా చోట్ల రహదారులపై వాహనాలు తిష్ట వేశాయి. సర్వీస్ రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను పార్క్‌చేసి వదిలేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా తాటిచెట్ల పాలెం – మహారాణి పార్లర్ 80 ఫీట్ రోడ్డు నిత్యం ఆక్రమణలతోనే నిండి ఉంటుంది. ఈ రహదారిలో ఎప్పుడూ సగభాగంలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్, ఇటుక, ఇసుక, పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రి దర్శనమిస్తాయి. ఆక్రమణలతో ఈ రహదారి సగానికి పైగా కుచించుకుపోయింది. పాదచారులు రోడ్డు మధ్యలో నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

పార్కింగ్ సదుపాయం లేక..

తాటిచెట్లపాలెం, నరసింహనగర్ తదితర ప్రాంతాల్లో రోజులు, నెలల తరబడి రోడ్లపైనే వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. అపార్ట్‌మెంట్లు, సెల్లార్లు సరిగా లేని వ్యాపార సముదాయాల వద్ద రహదారులపై వాహనాలు బారులు తీరుతున్నాయి. కొన్ని అపార్ట్‌మెంట్ల వద్ద కనీసం పార్కింగ్ సదుపాయం కూడా లేకపోవడంతో నివాసులు రోడ్లపైనే వారి కార్లు, ద్విచక్ర వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. దీని వల్ల ఇతర వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

కార్ల నుంచి బస్సుల వరకు..

తాటిచెట్లపాలెం జీవీఎంసీ వాటర్ ట్యాంక్స్ నుంచి రామచంద్రనగర్ ఆర్చ్ వరకు రోడ్డుకిరువైపులా, కైలాసపురం ఇనార్బిట్ మాల్ వెనుక వైపు, నరసింహనగర్ ఇలా అనేక చోట్ల రోడ్లపైన చిన్న చిన్న కార్ల నుంచి పెద్ద పెద్ద బస్సుల వరకు పార్క్ చేస్తున్నారు. కొన్ని వాహనాలు ఉదయమే తీసి, సాయంత్రం తిరిగి పార్క్ చేస్తుంటారు. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డుపై కనీసం కదలలేని, కదపలేని స్థితిలో ఎందుకు పనికిరాని వాహనాలు పడి ఉన్నాయి. వీటి వల్ల రోడ్డు ఇరుకైపోయింది. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు, పాదచారులు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్లపై నిలిపి వదిలేస్తున్న వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్యలతోపాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారులపై రాంగ్ పార్కింగ్‌ను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.


ఇనార్బిట్ మాల్ వెనుక రోడ్డులో నిలిపివేసిన ట్రావెల్స్ వాహనాలు

వృద్ధుడికి సపర్యలు.. హోంలో ఆశ్రయం


వృద్ధుడిని హోంకు తరలిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ దేవి, పోలీస్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో స్టేషన్ జంక్షన్ వద్ద 70 ఏళ్ల వృద్ధుడు రోడ్డుపై పడి ఉన్నాడు. ఆ సమయంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సింగంపల్లి దేవి వెంటనే స్పందించి కంట్రోల్ రూంకు సమాచారమిచ్చారు. ఈ వ్యక్తి దుస్తుల్లోనే మల, మూత్ర విసర్జన చేసి ఉండటంతో పోలీస్ సిబ్బంది శుభ్రం చేసి నగరంలోని నిరాశ్రయుల హోంకు తీసుకెళ్లి చేర్పించినట్లు తెలిపారు. ఇతడు విజయనగరానికి చెందిన వ్యక్తని, అనారోగ్యంతో బాధ పడుతుండటంతో కొడుకులు చికిత్స చేయించలేక రోడ్డుపై వదిలేసి వెళ్లినట్లు పోలీసులకు తెలిసింది.

పడవ ఆకృతిలో దుర్గాదేవి మండపం


మధురానగర్‌లో పడవ ఆకృతి మండపంలో కొలువైన దుర్గాదేవి

సీతంపేట: సీతంపేట మధురానగర్ రోడ్డులో స్థానికులు ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నీటిలో తేలుతున్న పడవ ఆకృతిలో మండపం నిర్మించి అందులో దుర్గాదేవిని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ విశేష పూజా కార్యక్రమాలు, కుంకుమ పూజలు జరిపిస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు


ప్రతిజ్ఞ చేస్తున్న శ్యామల దీపిక, వైద్యాధికారి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది

మద్రిపాలెం: మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం తనిఖీలు చేయించుకోవాలని బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక సూచించారు. స్వస్థ్ నారీ–స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం 53వ వార్డు మద్రిపాలెం శివనగర్ యూపీహెచ్‌సీలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటూ కుటుంబాన్ని సంతోషంగా చూసుకోవాలన్నారు. తరచూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శ్యామల దీపిక స్వయంగా కంటి వైద్య పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సునీల్ అగర్వాల్, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనూష, యూపీహెచ్‌సీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పది కంపెనీలు పాల్గొని 900 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ చదివిన ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం.ఏపీజీవోవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డ్‌తో హాజరు కావాలని చెప్పారు. స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఉందని, వివరాలకు 85558 68681 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దీన్ దయాళ్‌కు ఘన నివాళి


దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆ పార్టీ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక మాట్లాడుతూ దీన్ దయాళ్ పార్టీకి చేసిన సేవలు వెలకట్టలేనివని, ఆయన కృషితో నేడు పార్టీ ఈ స్థాయికి వచ్చిందని తెలిపారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సునీల్ అగర్వాల్, లోహిత్‌రావు, అరుణ్‌బాబు, నాగరాజు, గిరీష్, విజయరామరాజు, రామరాజు, దుర్గారావు, అనంతబాబు, కోన వెంకట్రావు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 22 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ తమ సిబ్బందితో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఒడిశా గజపతి జిల్లాకు చెందిన జీబారత్న మాజీ విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా మహారాష్ట్ర నాగపూర్‌కు అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఇతడి వద్ద నుంచి రూ.1.10 లక్షల విలువైన సుమారు 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

లక్ష్మీనరసింహ స్వామికి పంచామృతాభిషేకం


స్వామికి అభిషేకం చేస్తున్న పండితుడు

సీతంపేట: భాద్రపద స్వాతి నక్షత్రం సందర్భంగా లలితానగర్ శ్రీలలితా పీఠంలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామికి గురువారం వేద పండితులు విశేష పంచామృతాభిషేకం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామికి విశేష హారతులు సమర్పించారు.

విద్యుత్ సిబ్బంది జీతాలు పెంచాలని వినతి


ఏపీఈపీడీసీఎల్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 జిల్లాల్లో ఎనీ టైం పేమెంట్ మెషీన్(విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రం)లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు పెంచాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గురువారం గురుద్వారా వద్ద గల ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం ద్వారా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిటు జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ ఈ సేవా కేంద్రాల్లో సుమారు 80 నుంచి 100 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, వీరికి కేవలం రూ.7 వేల జీతం రెండేసి నెలలకోసారి ఇస్తున్నారని తెలిపారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు, వారాంతపు సెలవులు, సిక్ లీవ్‌లు గానీ, మహిళా సిబ్బందికి ప్రసూతి సెలవులు కూడా ఇవ్వడం లేదని, సంబంధిత కాంట్రాక్టర్ కార్మిక నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. వీరి సమస్యలు పరిష్కరించేలా అధికారులు కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు చంద్రశేఖర్, సత్యనారాయణ, సత్యారావు, రాజేష్, సాయిలక్ష్మి, గాయత్రి, ప్రశాంతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై దాడులు ఆపాలని ధర్నా


జెడ్సీ రాముకు వినతిపత్రం అందిస్తున్న చిరు వ్యాపారులు, సీఐటీయూ నాయకులు


జోన్-5 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు, సీఐటీయూ నాయకులు

కంచరపాలెం: కూటమి ప్రభుత్వం తోపుడు బండ్లు, చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని వారం రోజులుగా దుకాణాలు తొలగిస్తూ వారి పొట్ట కొడుతుండటాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జోనల్ కార్యాలయానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ చిరు వ్యాపారులను లేకుండా చేయడం ద్వారా విదేశీ, స్వదేశీ మాళ్లకు ఎటువంటి ఆటంకాలు ఉండకుండా చేసే ఉద్దేశంతో చంద్రబాబు ప్రభుత్వం ఈ దాడులు చేస్తోందని ఆరోపించారు. తోపుడు బండి, చిరు వ్యాపారులను తొలగించి ఆ స్థలాలను కాంట్రాక్టర్లకు కట్టబెట్టడం కోసమే ఈ ప్రయత్నాలు చేస్తోందన్నారు. తక్షణమే ఈ దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు, వ్యాపారులు పోరాటాల ద్వారా కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు వినతిపత్రాలు అందించారు. చిరు వ్యాపారులతో జెడ్సీ మాట్లాడుతూ పర్మినెంట్ స్ట్రక్చర్ నిర్మాణం ఉంటే తొలగిస్తున్నామని, తోపుడు బండ్లను తొలగించడం లేదని తెలిపారు. వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పి.మూర్తి, నాయకులు జి.శ్రీనివాసరావు, ఎల్లాజీ, ఎస్.చిరంజీవిరావు, కమిటీ సభ్యులు ఆర్.నంద, పి.పూర్ణ, ప్రసాదులు, శ్రీనివాసరావు, బషీర్, వెంకటరావు పాల్గొన్నారు.

అధికారులను సస్పెండ్ చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ పరిధిలో వేలాది మంది వీధి విక్రయదారుల జీవనోపాధిని ధ్వంసం చేసి, వారి జీవించే హక్కును కాలరాస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ విశాఖ జిల్లా కమిటీ తరపున జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీధి విక్రయదారుల చట్టం 2014 ప్రకారం వీధి విక్రయదారుల జీవనోపాధి, వారు గౌరవప్రదంగా జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీ కమిషనర్‌కు కట్టబెట్టిందన్నారు. దానికి విరుద్ధంగా ఆపరేషన్ లంగ్స్ పేరుతో పేదలపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. వీధి విక్రయదారులకు రక్షణ కల్పించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, అనుబంధ ఏపీ ప్రగతిశీల వీధి విక్రయదారుల సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నం చిన్నారి, బి.గీత, ఎస్. వెంకటలక్ష్మి, ఇ.లక్ష్మి, బి. రామకృష్ణ, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

జంక్షన్ జామ్


స్వర్ణభారతి స్టేడియం జంక్షన్‌లో అన్నివైపుల నుంచి దూసుకొస్తున్న వాహనాలు

సీతంపేట: రేసపువానిపాలెంలోని స్వర్ణ భారతి స్టేడియం కూడలిలో ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ జంక్షన్‌లో సాయంత్రం, రాత్రి వేళల్లో ట్రాఫిక్‌ను నియంత్రించే వారు లేక మూడు వైపులా నుంచి ఇష్టానుసారంగా వాహనాలు దూసుకురావడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. రామాటాకీస్ వైపు నుంచి, అటు మద్దిలపాలెం నుంచి, బుల్లయ్య కళాశాల వైపు నుంచి నిత్యం వాహనాల రద్దీగా ఉంటుంది. ఇటువంటి మార్గంలో వాహనాల నియంత్రణ లేక వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్వర్ణభారతి జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ఏళ్లు గడిచినా వాటిని వినియోగంలోకి తేలేదు. ఫలితంగా ఇక్కడ ఇక్కట్లు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కాత్యాయనీ నమోస్తుతే..


బాపూజీనగర్‌లో దుర్గాదేవికి కుంకుమ పూజలు చేస్తున్న అర్చకులు, మహిళలు


లలితా పీఠంలో ధైర్యలక్ష్మిగా పద్మావతి అమ్మవారు


పాత రేసపువానిపాలెంలో కాత్యాయనిగా దుర్గాదేవి


మురళీనగర్‌లో లక్ష్మీదేవి అలంకరణలో లలితాదేవి

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో పద్మావతి అమ్మవారిని ధైర్యలక్ష్మిగా అలంకరించారు. ఉదయం చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, అమ్మవారి సన్నిధిలో, మణిద్వీపంలో శ్రీచక్రనవావరణ, సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, చండీ హోమం చేశారు. పీఠం దర్బారు హాల్లో పండితుల దత్తాత్రేయ, దక్షిణామూర్తి హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. పీఠంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు లలితాదేవి హోమం, మహాలక్ష్మి షడక్షరి, ఖడ్గమాల హోమం జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

పార్వతీ దేవికి కుంకుమ పూజలు

సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీ దేవి కాత్యాయని దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు చేశారు.

శాంతి స్వరూపిణి ఆలయంలో..

పాత రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం పక్కన గల శాంతి స్వరూపిణి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయని దేవిగా దర్శనమిచ్చారు. గులాబి రంగు చీరలో అమ్మవారిని చూడముచ్చటగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. శుక్రవారం మహాలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ తెలిపింది.

దుర్గాదేవికి కుంకుమ పూజలు

కంచరపాలెం: జీవీఎస్‌సీ 54వ వార్డు 104 ఏరియా బాపూజీనగర్‌లోని శ్రీసీతారామాంజనేయ ఆలయం జైసంతోషిమాత సన్నిధిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని కాత్యాయనీ దేవిగా అలకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు, రామలక్ష్మి దంపతుల నేతృత్వంలో ప్రధాన అర్చకుడు సూర్యప్రకాష్ శర్మ, మహిళలు, భవానీ భక్తులు కుంకుమ పూజలు చేశారు. అర్చకులు ఆంజనేయశర్మ, ప్రభాకర్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాత్యాయనిగా కనకమ్మ


సీతన్న గార్డెన్స్‌లో కాత్యాయనీ దేవి

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార సీతన్న గార్డెన్స్‌లోని శ్రీకనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం అమ్మవారు కాత్యాయని దేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లక్ష్మీదేవికి సహస్ర కుంకుమార్చన

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాదేవి గురువారం లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కరెన్సీ నోట్లతో తయారు చేసిన దండ వేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తుల ఆధ్వర్యంలో సహస్ర కుంకుమార్చనలు జరిపారు.

నిరంతరం వీధిలైట్ల వెలుగులు



వరాహగిరి కాలనీ-2లో రెండు వారాలుగా పగలు, రాత్రి వెలుగుతున్న లైట్లు



సోనియాగాంధీ నగర్‌లో పగటి వేళ వెలుగుతున్న విద్యుత్ లైట్లు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధిలైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. వీధిలైట్ల అధ్వాన నిర్వహణ, విద్యుత్ వృథాపై స్థానికులు మండిపడుతున్నారు. జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ-2 కొండవాలు ప్రాంతంలో సుమారు 2 వారాలుగా వీధి లైట్లు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. ఇదే వార్డు సోనియాగాంధీ నగర్‌లో చాలా రోజులుగా వీధిటైల్లు పగలు, రాత్రి వెలుగుతూనే ఉన్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. వాస్తవానికి పగలు విద్యుత్ లైట్లు ఆగిపోవాలి. ఇవి రోజులు వారాలు తరబడి ఆరడం లేదు. సంబంధి అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

25వ వార్డులో మెగా ఫాగింగ్


సీతంపేటలో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ మలేరియా సిబ్బంది

సీతంపేట: దోమల నిర్మూలనకు జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది 25వ వార్డులో గురువారం సాయంత్రం మెగా ఫాగింగ్ నిర్వహించారు. సీతంపేట, బీటీఆర్ నగర్, హరిజన వీధి, కనకమ్మ వీధి, గణేష్‌నగర్, గొల్ల వీధి, పాత చేపల బజార్, రాజేంద్రనగర్, శాంతిపురం, మధురానగర్, గురుద్వారా హైవే ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది శివన్నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.